సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం, 26, అక్టోబర్, 2022



ఘనంగా దీపావళి

దీపావళి పండగను జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

9లో



కార్తీక పూజల పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస ప్రత్యేక పూజలపోస్టర్‌ను ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ తమర్భ నరసింగ రావు, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు.

విధుల్లో చేరిన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



- సెలవు అనంతరం బాధ్యతలు స్వీకరణ
- పలు శాఖల అధికారులతో సమావేశాలు

8లో

న్యూస్‌రీల్

డిగ్రీలో ప్రవేశానికి 27 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి రెండో విడత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం మంగళవారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 27 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఎంపీసీ, సీబీజెడ్, బిఏ, బికాం జనరల్, బీయస్సీ హార్టికల్చర్ గ్రూపుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు వచ్చేనెల 3న సీట్లు కేటాయిస్తారని ప్రిన్సిపాల్ వివరించారు.

గెస్ట్ టీచర్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

తొలిరోజు 26 మంది అభ్యర్థుల హాజరు



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న పలు విద్యాలయాల ప్రిన్సిపాళ్లు

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో గెస్ట్ టీజీటీ,పీజీటీ టీచర్ పోస్టుల్లో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులు ప్రారంభించారు. పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలిచ్చారు.గురుకుల విద్యాలయాల కన్వీనర్ ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, పలు విద్యాలయాల ప్రిన్సిపాళ్లు రమణారావు, ప్రభాకరరావు, గణేష్, భాస్కరరావు అన్నామణి, రెవెన్యూ అధికారి నాగమణి తొలిరోజు 26 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈనెల 29 వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరిశీలన జరుగుతుందని కన్వీనర్ మూర్తి తెలిపారు.

కరాటేలో గిరి బాలిక ప్రతిభ



స్వర్ణ పతకం సాధించిన గాయత్రి

రంపచోడవరం: కరాటే పోటీల్లో గిరిజన బాలిక రాణిస్తోంది. ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. దేవీపట్నం మండలం పాముగండి గ్రామానికి చెందిన మడి గాయత్రి ఒంగోలులో జరిగిన కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. కాకినాడ పి.వెంకటాపురంలోని డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో టెన్త్ చదువుతోంది. ఒంగోలులో ఈ నెల 23న జరిగిన టైక్వాండ్ చాంపియన్‌షిప్‌లో 11, 14, 17 కేటగిరీల్లో 20 పతకాలు సాధించినట్లు ఆమె తండ్రి మడి రాజన్నదొర తెలిపారు. తొమ్మిది బంగారు పతకాలు, ఆరు సిల్వరు, ఐదు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. డిసెంబరు నెలలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికై నాట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

సాక్షి,పాడేరు: పాడేరు డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించే లక్ష్యంగా బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నామని సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ, విద్యుత్ పంపిణీ సంస్థ పాడేరు ఈఈ కె.మల్లికార్జునరావు తెలిపారు.కొత్తపాడేరు రోడ్డులోని పాడేరు డివిజన్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు ఈ సదస్సు జరుగుతుందని, విద్యుత్ సరఫరాలో అంతరాయం, బిల్లుల హెచ్చు తగ్గుల సమస్యలు, కొత్త సర్వీసులకు సాంకేతిక ఇబ్బందులు ఇతర అన్ని సమస్యలను వినియోగదారులు తెలియజేయవచ్చన్నారు.


కనువిందు చేస్తున్న పులులు

ఆరిలోవ (విశాఖ తూర్పు): ఇందిరాగాంధీ జూ పార్కులో పెద్ద పులులు సందర్శకులను మళ్లీ పలకరిస్తున్నాయి. సుమారు ఏడాది క్రితం జూలో పెద్ద పులుల ఎన్‌క్లోజరు వెనుక గోడ కూలిపోయింది. దీంతో ఆ గోడ కొండసైడు బహిరంగంగా మారిపోయింది. అప్పటి నుంచి జూ అధికారులకు అందులో పులులను విడిచిపెట్టడానికి వీలుపడలేదు. వెంటనే గోడ నిర్మాణం చేపట్టారు. అయినా ఆ గోడ నిర్మాణం మందకొడిగా సాగడంతో ఏడాదికి పైగా పెద్ద పులులు సందర్శకులకు కనిపించలేదు. ఇటీవల గోడ నిర్మాణం పూర్తికావడంతో పెద్ద పులులను ఈ ఎన్‌క్లోజర్‌లో విడిచిపెడుతున్నారు.

గ్రహణం ఎఫెక్ట్



ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద 5.41గంటల సమయంలో దర్శనమిచ్చిన పాక్షిక సూర్యగ్రహణం



- నిర్మానుష్యంగా సింహగిరి
- ఉదయం 9 గంటలకు ఆలయ కవాటబంధనం
- నేటి ఉదయం 6.30 గంటల నుంచి పునఃదర్శనాలు



నిర్మానుష్యంగా మారిన సింహగిరి రాజగోపురం మార్గం



పాడేరులో మూతపడిన మోదకొండమ్మ ఆలయం



రాజవొమ్మంగిలోని షిరిడీ సాయిబాబా ఆలయం

బోసిపోయిన ఆలయాలు

సాక్షి, విశాఖపట్నం: సూర్య గ్రహణం కారణంగా మంగళవారం సింహగిరి నిర్మానుష్యంగా మారింది. ఉదయం 9 గంటలకు దర్శనాలు నిలిపి వేసి ఆలయ కవాటబంధనం చేశారు. దీంతో సింహగిరి భక్తులు లేక వెలవెలబోయింది. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి స్వామి దర్శనాలు కల్పించిన ఆలయ అధికారులు తొమ్మిది గంటలకు నిలిపివేశారు. అనంతరం ఆలయ నీలాద్రిగుమ్మం, ప్రధాన ద్వారం, రాజగోపురం తలుపులను దేవస్థానం వైదికులు మూసివేసి కవాటబంధనం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయ తలుపులు తెరచి సంప్రోక్షణ చేపట్టారు.

కనకమహాలక్ష్మి ఆలయం

నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయాన్ని మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి మూసివేశారు. గ్రహణానంతరం సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 8.30 గంటల నుంచి తిరిగి భక్తులకు దర్శనం కల్పించారు.

సాక్షి,పాడేరు/రాజవొమ్మంగి/కొయ్యూరు: సూర్య గ్రహణం కారణంగా మంగళవారం ఆలయాల్లో ఉదయం 9 గంటలకు దర్శనాలు నిలిపివేశారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లి ఆలయాన్ని మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తెరిచారు. ఆలయ పూజారి సుబ్రమణ్యంశాస్త్రి, సిబ్బంది అమ్మవారికి సంప్రోక్షణ నిర్వహించారు. రాజవొమ్మంగిలోని షిర్డీ సాయిబాబు, రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వరస్వామి ఆలయం, జడ్డంగిలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి, దుర్గమ్మ, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడా సంప్రోక్షణ జరిపించారు. కొయ్యూరులోని భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయం, కనకదుర్గమ్మ ఆలయం, రాజేంద్రపాలెంలో రామాలయం, షిర్డీసాయిబాబా ఆలయాల్లో కూడా సంప్రోక్షణ జరిగింది.

గ్రహణం 'పట్టు'

- నిలబడిన రోకలి
- ముగియగానే పడిపోయిన వైనం
- లొద్దిపాకల గ్రామంలో విశేషం



గ్రహణం సమయంలో లొద్దిపాకలలో నిలబడిన రోకలి

కొయ్యూరు: గ్రహణానికి రోకలికి సంబంధం ఉందని చెబుతున్నారు చింతలపూడి పంచాయతీ లొద్దిపాకలకు చెందిన గిరిజనులు. మంగళవారం సాయంత్రం పాక్షిక సూర్య గ్రహణం ఏర్పడగానే లొద్దిపాకల గ్రామస్తులు రోకలిని తీసుకువచ్చి కంచంపై ఉంచారు. గ్రహణం ప్రభావం ఉన్నంత వరకు రోకలి అలానే ఉండిపోయింది. గ్రహణం వీడిన తరువాత రోకలి పడిపోయింది. ఈ సందర్భంగా గ్రామస్తులు విలేకరులతో మాట్లాడుతూ ప్రతీసారి సూర్య గ్రహణం సమయంలో రోకలిని కంచంపై ఉంచుతున్నట్టు చెప్పారు. దాని ప్రభావం ఉన్నంత వరకు రోకలి పడిపోకుండా నిలబడి ఉంటుందని తెలిపారు. గ్రహణం ముగియగానే రోకలి పడిపోతుందని వారు వివరించారు. తమ పూర్వీకుల కాలం నుంచి ఇలాగే జరుగుతోందని వారు తెలిపారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి


- కలెక్టర్ సుమిత్ కుమార్
- జిల్లాలో 44 గ్రామ సచివాలయాల్లో అందుబాటులో సేవలు



వీఆర్‌పురం మండలంలోని రాజుపేట సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

సాక్షి, పాడేరు: పదేళ్లు పూర్తయిన ఆధార్‌కార్డులను వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం కోరారు.జిల్లాలోని 22 మండలాలకు సంబంధించి 44 సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని ప్రారంభించామని, తొలిరోజు అనేక మంది సద్వినియోగం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 31 వరకు ఆయా సచివాలయాల్లో నిర్వహిస్తారన్నారు. మళ్లీ వచ్చేనెల రెండో వారంలో సేవలు ప్రారంభమవుతుందన్నారు. మొబైల్ ఆధార్ అప్‌డేట్ శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలో అనేకమందికి సంబంధించి పాత డేటాయే ఆన్‌లైన్‌లో ఉందని, బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు, ఇతర ప్రభుత్వ పథకాల అమలులో తలెత్తే సమస్యలు పరిష్కారానికి ఆధార్ అప్‌డేట్ ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని ఆయన కోరారు.

అతిథులొచ్చాయి



ఫజుల్లాబాద్‌లో సైబీరియా కొంగలు

- విదేశీ పక్షుల రాకతో ఫజుల్లాబాద్‌లో సందడి
- ఏటా వందల సంఖ్యలో రాక
- ఇక్కడే సంతానోత్పత్తి
- ఆప్యాయంగా చూసుకుంటున్న గ్రామస్తులు



రంపచోడవరం: విదేశీ పక్షుల రాకతో దేవీపట్నం మండలం ఫజుల్లాబాద్ గ్రామం సందడిగా మారింది. సుమారు వెయ్యికి పైగా సైబీరియా పక్షులు గ్రామానికి తరలివచ్చాయి. గ్రామంలోని చెట్లను ఆవాసంగా మార్చుకున్నాయి. నైరుతి రుతుపవనాలు ఆగమనంతో ఇవి ఏటా ఇక్కడికి చేరుకుంటాయి. మధ్య ఆసియాలోని సైబీరియా కన్నా ఈ ప్రాంతంలో వేడి వాతావరణం ఉండటం వీటి సంతానోత్పత్తికి అనుకూలం. అందువల్ల ఏటా జూలై, ఆగస్టులో వచ్చి కార్తీక మాసం చివరి వరకు ఇక్కడే ఉంటాయి. సంతానోత్పత్తి అనంతరం పిల్లలతో ఇక్కడి నుంచి వెళ్లిపోతాయని గ్రామస్తులు తెలిపారు. ఒంటరిగా ఈ ప్రాంతానికి వచ్చే విదేశీ పక్షులు ఇక్కడ సుమారు ఐదు నెలలపాటు ఉంటాయి. వీటిని అతిథులు మాదిరిగా గ్రామస్తులు చూసుకుంటారు. తమ తాతల కాలం నుంచి ఈ పక్షులు వస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో గ్రామంలోని పక్షులకు ఎవరైనా హాని తలపెడితే పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఏటా గ్రామానికి వస్తుండటంతో వాటికి ఎటువంటి హాని జరగకుండా ప్రాణంగా చూసుకుంటున్నారు. ఐదు నెలలపాటు గ్రామంలో చింతచెట్ల పైనే ఉంటున్నాయి. గతంలో ఏటా రెండు వేలకు పైగా పక్షులు వచ్చేవి. అయితే ప్రస్తుతం వాటి సంఖ్య సుమారు వెయ్యికి తగ్గిపోయిందని గ్రామస్తులు తెలిపారు. జూలై నెలలో వచ్చి చెట్లపై గూడు ఏర్పాటు చేసుకుని గుడ్లు పెడతాయి. వాటిని పొదిగి పిల్లలను చేసి నవంబరు నెలాఖరులోపు వెళ్లిపోతాయి. ఫజుల్లాబాద్ గ్రామానికి చుట్టుపక్కల పంటపొలాలు, చెరువులు ఉన్నందున ఆహారం లభ్యత ఎక్కువగా ఉంటుంది. ఈ మధ్యకాలంలో కోతుల బెడద ఎక్కువైంది. పక్షులు గూళ్లను పాడు చేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు.

ప్రాణంగా చూసుకుంటున్నాం



గ్రామంలో ఉండే కొంగలకు ఎవరు హాని తలపెట్టారు. మొదట్లో వాటిని పట్టుకునేందుకు వేటగాళ్లు ప్రయత్నించారు. గ్రామస్తులంతా అడ్డుకున్నారు. అప్పటినుంచి ఎవరూ హాని తలపెట్టరు. వాటిని ఎంతో ఆప్యాయంగా చూసుకుంటున్నాం. ఈ పక్షులను తిలకించేందుకు పర్యాటకులు వస్తుంటారు.

–ధర్మరాజు, ఫజుల్లాబాద్, దేవీపట్నం మండలం

చింతూరు రెవెన్యూ డివిజన్‌కు రాజముద్ర

జిల్లాలో నాలుగు మండలాల ప్రజల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరింది. చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాలను కలిపి కొత్తగా చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జూలై 27న వరద ప్రాంతాల పరిశీలనకు చింతూరు మండలం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుయిగూరులో మాట్లాడారు. కొత్తగా చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని ప్రజలకు హామీఇచ్చారు. మాట ఇచ్చిందే తడవుగా ఆయన కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ప్రక్రియకు చకచకా చర్యలు చేపట్టారు.

- ఉత్వర్వుల జారీపై హర్షం
- చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాలతో ఏర్పాటు
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి
- చిరకాలం వాంఛ నెరవేరిందని స్థానికుల ఆనందం

కొత్త రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటైన చింతూరు మ్యాపు



చింతూరు: రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వరద ప్రాంతాల పర్యటనకు సందర్భంగా ఇచ్చిన హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెనువెంటనే అమల్లోకి తెచ్చారు.

- సెప్టెంబరు ఏడున జరిగిన మంత్రివర్గ సమావేశంలో చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ఆమోద ముద్ర పడింది. అనంతరం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సంబంధించి అభ్యంతరాలపై నోటిఫికేషన్ జారీఅయింది. ఆ గడువు ముగియడంతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.
- ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం పట్ల చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం మండలాల ప్రజలనుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.
- అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇప్పటివరకు పాడేరు, రంపచోడవరం రెండు రెవెన్యూ డివిజన్లు వుండగా, కొత్తగా చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ఆ సంఖ్య మూడుకు పెరిగింది.
- కొత్తగా ఏర్పాటైన చింతూరు డివిజన్‌లో మొత్తం 1,35,082 మంది జనాభా వుండగా 90,929 మంది ఓటర్లున్నారు. వీరిలో 82,992 మంది ఎస్టీ జనాభా ఉన్నారని అధికారవర్గాలు తెలిపాయి.

సర్వత్రా హర్షం

మాట ఇస్తే నిలబెట్టుకోవడం తన నైజమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించుకున్నారని నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు పేర్కొన్నారు. ఇటీవల వరద ముంపు ప్రాంతాల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చింతూరు మండలం కుయిగూరు, చట్టిలో పర్యటించారు. రెవెన్యూ డివిజన్ ఎత్తివేయడంతో తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని, పోలవరం భూ సమస్యలతో పాటు ఇతర సమస్యలపై రంపచోడవరం వెళ్లాలంటే దూరాభారంగా మారిందని ఇక్కడి ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చింతూరు కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీనిచ్చారు. ఈ మేరకు హామీని నెరవేరుస్తూ చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

రెవెన్యూ డివిజన్ వివరాలు

మండలాలు	పంచాయతీలు	గ్రామాలు	మొత్తం జనాభా	పురుషులు	మహిళలు
చింతూరు	18	125	40,601	19,630	20,971
కూనవరం	16	78	27,123	12,834	14,289
వీఆర్‌పురం	11	73	25,598	12,168	13,430
ఎటపాక	21	111	41,762	20,744	21,018
మొత్తం	66	387	1,35,082	65,376	69,706

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు హర్షణీయం



ప్రభుత్వం చింతూరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం హర్షణీయం. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు పరిపాలనా సౌలభ్యం కలగనుంది.

–నాగులాపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్యే రంపచోడవరం

నృత్య పోటీల్లో ఏకలవ్య విద్యార్థినుల ప్రతిభ



జాతీయ స్థాయి నృత్య పోటీలకు ఎంపికైన పాడేరు ఏకలవ్య మోడల్ పాఠశాల విద్యార్థినులు

సాక్షి,పాడేరు: పాడేరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు నృత్యపోటీల్లో ప్రతిభ కనబరిచారు. బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనలకు ఏడుగురు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. గత నెల్లూరు జిల్లా కొడవలూరు ఏకలవ్య పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీల్లో జి.సుగంధశ్రీ, ఇక్షిత, భావన, అనూష, వెంకటలక్ష్మి, పావనిశ్రీ, విశ్వప్రియ ద్వితీయ స్థానం సాధించారని ఆయన వివరించారు. ఈనెల 29 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు బెంగళూరులో జరగనున్న నృత్య పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఏవోబీలో గజగజ



మినుములపుట్టు వద్ద చలిమంట కాగుతున్న గిరిజనులు

చలి తీవ్రతకు వణుకుతున్న గిరిజనులు



ముంచంగిపుట్టులో దట్టంగా కురుస్తున్న మంచు

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మంచుతోపాటు చలి తీవ్రత మొదలైంది. ప్రతిరోజూ ఉదయం విపరీతంగా మంచు కురుస్తోంది. గిరిజన గ్రామాలన్నీ మంచు దుప్పటితో కప్పబడి ఉంటున్నాయి. దీంతో రోజువారీ పనులకు వెళ్లే గిరిజనులు మంచుతో అవస్థలు పడుతున్నారు. మంచుకి తోడు చలి తీవ్రత సైతం మొదలు కావడంతో సరిహద్దు గిరిజనులు వణికిపోతున్నారు. గ్రామాల్లో గిరిజనులు చలికి తట్టుకోలేక చలి మంటలు వేసుకుని చలి నుండి ఉపశమనం పొందుతున్నారు. గత వారం రోజులుగా భిన్న వాతావరణం సైతం నెలకొంటోంది. ఉదయం పూట మంచు, చలి ప్రభావం ఎక్కువగా ఉంటోంది. మధ్యాహ్నమయ్యే సరికి చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. సాయంత్రం చలిగాలులు విజృంభిస్తున్నాయి.

ఎమ్మెల్యే పాల్గుణ ఔదార్యం


విద్యార్థికి ఆర్థిక సాయమందిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: పేద కుటుంబానికి చెందిన విద్యార్థి చదువుకునేందుకు తన వంతు సాయంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆర్థిక సాయమందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని పద్మాపురం పంచాయతీ గత్తరగుడ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నగేష్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యసిస్తున్నాడు. ఆర్థిక స్తోమత లేక చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు తెలుసుకొని సర్పంచ్ పెట్టేలి సుస్మిత, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి సుంక్రలు మానవదృక్పథంతో విషయాన్ని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే పాల్గుణ తక్షణమే స్పందించి విద్యార్థి నగేష్‌కు రూ.6వేలు ఆర్థిక సాయమందించారు. బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ, సర్పంచ్, నాయకులుకు నగేష్, అతని కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాడి గేదెను రక్షించబోయి రైతు మృతి

బుచ్చెయ్యపేట: పాడి గేదెను రక్షించబోయి ఊబిలో కూరుకుపోయి రైతు మృతి చెందిన సంఘటన బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో జరిగింది. బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలేనికి చెందిన వియ్యపు అప్పారావు (51) ఆదివారం వడ్డాదిలో జరిగే వారపు సంతలో పాడి గేదెను కొనడానికి వెళ్లాడు. సంతలో పాడి గేదెను కొని నేతవానిపాలేనికి తోలుకెళ్తుండగా గేదె వడ్డాది పాండవుల చెరువులోకి పారిపోయింది. చెరువులోకి దిగిన గేదె బయటకు రాకపోవడంతో అప్పారావు చెరువులోకి దిగగా ఊబిలో కూరుకు పోయాడు. రాత్రికి అప్పారావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. సోమవారం ఉదయమైనా అప్పారావు రాకపోవడంతో గాలించగా వడ్డాది పాండవుల చెరువు వద్ద గేదె కనిపించగా చెరువు వద్ద అప్పారావు చెప్పులు ఉండడంతో గ్రామస్తులు చెరువులోకి దిగి గాలించారు. ఊబిలో కూరుకు పోయిన అప్పారావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని బుచ్చెయ్యపేట ఎస్‌ఐ కుమారస్వామి అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

శివారు గ్రామాల్లో ఏఎస్పీల పర్యటన

- చిన్నారులతో దీపావళి వేడుకలు
- బూసికొండ గ్రామానికి రోడ్డు కోసం జేసీబీని తీసుకెళ్లిన ఏఎస్పీ ప్రశాంత్ కిశోర్


బూసికొండ గ్రామస్తులు, పిల్లలతో ఏఎస్పీప్రశాంత్ కిశోర్

గూడెంకొత్తవీధి: గాలికొండ పంచాయతీలో బూసికొండ అత్యంత మారుమూల గ్రామం. రహదారికి నోచని గ్రామం .. ఒకప్పుడు మావోయిస్టులకు కేంద్ర బిందువుగా ఉన్న గ్రామం. అలాంటి గ్రామానికి చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ కిశోర్ సోమవారం సిబ్బందితో కలిసి పర్యటించి, గ్రామస్తులతో కలిసి దీపావళి సందడిని జరుపుకున్నారు. గ్రామానికి రోడ్డు వేయించేందుకు జేసీబీనీ తీసుకువెళ్లారు. పాడైన రహదారిని కొంత వరకు బాగు చేయించారు. అల్లూరి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు చింతపల్లి ఏఎస్పీ, గూడెం సీఐ అశోక్‌కుమార్‌లు బూసికొండకు వచ్చారు. గతంలో రోడ్డు కోసం గ్రామస్తులు కోరడంతో ఏఎస్పీ జేసీబీని తీసుకెళ్లి పాడైన రోడ్డున చదును చేయించారు. దీపావళి వేడుకలో భాగంగా గ్రామంలో చిన్నారులతో కలిసి వారు బాణసంచా కాల్చి సందడి చేశారు. ఏఎస్పీ ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ దీపావళిని గిరిజను చిన్నారులతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలను పొందాలని సూచించారు. గ్రామానికి రావడం ఎప్పటికి మరువలేమని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు

చిన్నారులతో ఏఎస్పీ మహేశ్వరరెడ్డి దీపావళి సందడి

కూనవరం: చిన్నారులు చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, ఆటపాటలలో ప్రతిభ కనబరచాలని, ఉన్నత చదువులు చదివి ఊరికి మంచి పేరు తీసుకురావాలని చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి ఆకాంక్షింక్షారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకోని మండల పరిధిలోని శబరి కొత్తగూడెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 100 చిన్నారులకు మిఠాయిలు, దీపావళి సామగ్రిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల సంభవించిన గోదావరి వరదల్లో అనేక కుంటుంబాలు ఎన్నో విధాలు నష్ట పోయాయన్నారు. ఈ నేపథ్యంలో శబరి కొత్తగూడెం గిరిజన పిల్లల్లో పండుగ వాతావరణం కల్పించాలని, చిన్నారులు చిరునవ్వులతో ఆనందంగా గడపాలని ఉద్దేశంతో గ్రామంలో పర్యటించినట్టు చెప్పారు. ఎటపాక సీఐ గజేంద్ర కుమార్, ఎంపీపీ పాయం రంగమ్మా.ఎస్‌ఐ బి.వెంకటేష్., మహిళా పోలీస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి పనులు


శ్రమదానంతో రోడ్డు వేస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: మారుమూల గిరిజన గ్రామస్తులు చేయి చేయి కలిపి, గ్రామానికి అవసరమైన రోడ్డును ఏర్పాటు చేసుకుంటున్నారు. మర్రివాడ పంచాయతీకి చెందిన నిమ్మలగొంది గ్రామం పంచాయతీ కేంద్రానికి 10కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి చేరేందుకు రహదారి సౌకర్యం లేదు. కొండలపై నుంచి నడచి వెళ్లాలి. అయితే గూడెంకొత్తవీధి మండలం రంపుల నుంచి కొక్కితపాడు మీదుగా ఇది వరకు ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు వేశారు. ఎక్కువగా అటువైపు నుంచి రాకపోకలు సాగిస్తారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా పాడైంది. ద్విచక్ర వాహనాలు నడవడం కూడా కష్టంగా మారింది. గ్రామంలో 500 మంది జనాభా ఉన్నారు. దీన్ని ఆనుకుని నాలుగు చిన్న గ్రామాలు కూడా ఉన్నాయి. అధ్వాన రహదారితో పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు గ్రామస్తులంతా ఏకమయ్యారు. రోడ్డు బాగు చేసేందుకు ముందుకొచ్చారు. వర్షాకాలంలో చిత్తడి రహదారితో కనీసం వైద్య సేవల కోసం ఆస్పత్రికి వెళ్లే పరిస్థితి లేదని, దీంతో తాత్కాలికంగా రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్నామని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బోల్తా పడిన జీపు...నిప్పు పెట్టిన దుండగులు


పూర్తిగా కాలిపోయిన జీపు

గూడెంకొత్తవీధి: సాగుల ఘాట్‌రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు ప్రమాదంలో పడిపోయిన జీపును తగులబెట్టారు. వివరాలివి. మెట్టగూడకు చెందిన గెమ్మెలి లింబే, వలసి, గెమ్మెలి రోజా, సుబ్బారావు, సాగులకు చెందిన పాంగి కుమారి, అడపా వీరన్నపడాల్ సోమవారం గూడెం వస్తున్నారు. అదే సమయంలో జీపు అదుపు తప్పి సాగుల ఘట్‌రోడ్డులో బోల్తా పడింది. గాయపడిన వారిని అంబులెన్స్ సహాయంతో గూడెం ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం వారిని చింతపల్లి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన జరిగిన కొన్ని గంటలకు ప్రమాదానికి గురైన జీపునకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో అది పూర్తిగా కాలిపోయింది. దీనిపై జీపు యజమాని ఫిర్యాదు మేరకు గూడెంకొత్తవీధి పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి నేరస్తుల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

72 కిలోల గంజాయితో నలుగురు అరెస్టు


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మారేడుమిల్లి: అక్రమంగా తరలిస్తున్న 72 కిలోల గంజాయిని మారేడుమిల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రాము తెలిపిన వివరాలివి. చింతూరు మండలం తులసి పాకల గ్రామంలో ఇన్నోవా కారులో గంజాయి లోడ్ చేసుకొని, మారేడుమిల్లి మీదుగా ముంబైకి తరలిస్తుండగా గుజ్జుమామిడి వలస జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. కారులో మూడు బస్తాల్లోని 72 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న మహారాష్ట్ర, ముంబైకి చెందిన రెహన్ రెయిన్ ఖాన్, చింతూరు మండలం పొల్లూరుకు చెందిన పట్టపల్లి రవి, తెలంగాణలోని వరంగల్ జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్, ఖమ్మం జిల్లా ముణుగురుకు చెందిన కోనేటి సత్యనారాయణ అనే నాలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. గంజాయి రవాణకు వినియోగించిన ఇన్నోవా కారు, పల్సర్ బైకును సీజ్ చేశారు. ఈ గంజాయి విలువ సుమారు రూ. 2,16,000 ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వేమనబాబుపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

సాక్షి, పాడేరు: రెండు రోజుల క్రితం పాడేరులో బీజేపీ నేత శరబ వేమనబాబు తలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తిని అరెస్టు చేయాలని ఆ పార్టీ నేతలు మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని నేతలు పాంగి రాజారావు, కురుసా రాజారావు, తాంగుల సత్యవతి, సల్లా రామకృష్ణ, లకే భాస్కరరావు తదితరులు ఎస్పీని కోరారు.

వివాహిత అనుమానాస్పద మృతి

చోడవరం రూరల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉంటున్న 35 ఏళ్ళ వివాహిత ఉరిపోసుకుని మృతి చెందినట్టు చోడవరం సబ్ ఇన్‌స్పెక్టర్ బి.యమున తెలిపారు. మండలంలోని జన్నవరం గ్రామానికి చెందిన మృతురాలు బగ్గ జ్యోతి బాలాజీనగర్‌లోని వాసవీ పాఠశాల వీధిలో నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మృతురాలు వైవాహిక పరమైన వివాదాల కారణంగా జన్నవరంలో ఉన్న భర్త, అత్త, మామలను విడిచి పెట్టి చోడవరంలో ఒంటరిగా నివసిస్తున్నట్టు ఎస్‌ఐ యమున తెలిపారు. ఈమె అచ్యుతాపురం బ్రాండెక్స్‌లో పనిచేస్తుంది. ఒక పాప, బాబు సంతానం. అయితే మృతురాలి తల్లి బుచ్చియ్యపేట మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన చేబోలు కొండమ్మ తన ఫిర్యాదులో తమ కుమార్తె జ్యోతి మృతికి ఆమె భర్త రమణబాబు, మరో ముగ్గురు కుటుంబీకులతోపాటు మరో వ్యక్తి మట్టా శ్రావణ్‌కుమార్ కారకులు అయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేసినట్టు ఎస్‌ఐ యమున చెప్పారు. దీంతో జ్యోతి మృతిని అనుమానాస్పదంగా పేర్కొంటూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మంగళవారం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం జరిపారు.

బైకు ప్రమాదంలో తండ్రీ, కూతుళ్లకు గాయాలు


గాయపడ్డ బాలిక, తండ్రి

చింతపల్లి: మండలంలోని అంతర్ల వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం బోల్తా పడి తండ్రి, కూతురు గాయపడ్డారు. కోలపరికి చెందిన పాంగి బుజ్జిబాబు కుమార్తె కీర్తన(8) రింతాడ పాఠశాలలో మూడో తరగతి చదువుతుంది. దీపావళి సెలవు ముగియడంతో మంగళవారం పాఠశాలకు తీసుకు వెలుతుండగా ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు బోల్తా పడడంతో ఇద్దరూ గాయపడ్డారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందించారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లిటౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్టు రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్‌ఐ నర్సింగరావు కథనం మేరకు వివరాలు... మండలంలో మార్టురు గ్రామానికి చెందిన మార్టురు రేవతి(16) పట్టణంలో ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. గత నెల 20వ తేదీన ఇంటి నుంచి కళాశాలకు వెళ్లి వస్తామని చెప్పి నేటికీ రాలేదని, రేవతి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

నూర్జహాన్ మృతి కేసులో ముగ్గురి అరెస్టు

చోడవరం రూరల్: వెంకన్నపాలెం గ్రామానికి చెందిన షేక్ నూర్జహాన్ మృతి కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ శ్రీనివాసరావు తెలిపారు. నూర్జహాన్ మృతికి కారకులుగా పేర్కొంటూ భర్త షేక్ ఇస్మాయేల్, అత్త షేక్ అమీనా బీబీ, మామ షేక్ ఇషాక్ మదీనాలను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించామని చెప్పారు.

కార్ షెడ్‌లో అగ్ని ప్రమాదం

నక్కపల్లి: జాతీయరహదారి పక్కన న్యాయం పూడి సమీపంలో ఉన్న కార్ మెకానిక్ షెడ్‌లో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. నెల్లిపూడి వీరబాబుకు చెందిన ఈ షెడ్‌లో షార్ట్ సర్క్యూట్‌కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో రెండు కార్లు, ఒక బైక్ పూర్తిగా దగ్ధమయ్యాయి. రిపేర్లకోసం షెడ్‌లో ఉంచిన మరికొన్ని వాహనాలకు కూడా స్వల్పంగా నష్టం వాటిల్లిందని, బాధితుడు వీరబాబు వాపోయాడు. ఆస్తి నష్టం సుమారు రూ.10లక్షలు ఉంటుందని అంచనా. దగ్ధమయిన వాటిలో వైఎస్సార్‌సిపి నాయకుడు, చందనాడ సర్పంచ్ తళ్లా భార్గవ్ కారు కూడా ఉంది. సమాచారం తెలుసుకున్న నక్కపల్లి అగ్ని మాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి శీరీష తెలిపారు.

తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు

పాయకరావుపేట: పాయకరావుపేట గ్రామానికి చెందిన కింతాడ శ్యామ్ అనే బాలుడు తన తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయినట్టు ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. ఎస్.నర్సాపురం గ్రామంలో 8 వ తరగతి చదువుతున్న శ్యామ్ అదే గ్రామంలో హాస్టల్‌లో ఉంటున్నాడు. దీపావళికి 22 న ఇంటికి వచ్చిన శ్యామ్ 23 న దీపావళి సామగ్రి కావాలని అనడంతో తల్లి మందలించింది. దీంతో శ్యామ్ రెండు రోజులుగా ఇంటికి రాకుండా వెళ్లిపోయాడని తెలిపారు.

విధుల్లో చేరిన ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు: ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ మంగళవారం విధుల్లో చేరారు.15రోజుల పాటు ఆయన సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి పీవోగా పాడేరు సబ్ కలెక్టర్ వి.అభిషేక్ అదనపు బాధ్యతలు నిర్వహించారు. సెలవు ముగియడంతో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలు శాఖల అధికారులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన సమావేశాలు నిర్వహించారు. ప్రజాసంఘాల నేతలు కూడా పీవోను కలిసి పలు సమస్యలను నివేదించారు. ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో గెస్ట్ టీచర్ల నియామకాలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర,ఇతర నేతలంతా పీవోకు వినతిపత్రం అందజేశారు.

చికిత్సపొందుతూ బాలింత మృతి

రాజవొమ్మంగి: ఉర్లాకులపాడు గ్రామానికి చెందిన గిరిజన మహిళ కోసూరి వెంకటలక్ష్మి (32) అనే బాలింత కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ 23వ తేదీ, ఆదివారం రాత్రి మరణించింది. జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సేవ సుజి అందజేసిన వివరాలు ఇలా వున్నాయి. వెంకటలక్ష్మి అత్తవారి ఊరు ఏలేశ్వరం మండలం రమణయ్యపేట. వెంకటలక్ష్మి 7వ నెల గర్భిణిగా జూలై 26వ తేదీన అమ్మగారి ఊరైన ఉర్లాకులపాడు వచ్చింది. ఆమె ఉర్లాకులపాడు అంగన్‌వాడీలో పేరు నమోదు చేసుకొని, అప్పటి నుంచి జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతోంది. పురిటినొప్పులతో జడ్డంగి పీహెచ్‌సీకు వచ్చిన ఆమెను వైద్యులు అక్టోబర్ ఒకటో తేదీన ఏలేశ్వరం సీహెచ్‌సీకు రిఫర్ చేశారు. అక్కడి వైద్యులు ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు పంపారు. జీజీహెచ్‌లో ఆమెకు అక్టోబర్ 4వ తేదీన సిజేరియన్ ఆపరేషన్ చేసి మగబిడ్డను బయటకు తీసారు. పుట్టిన బాబుకు ఫిట్స్ వచ్చాయి. బిడ్డ ఏడవకపోవడంతో ఐసీయూలో వుంచారు. తల్లి వెంకటలక్ష్మి అప్పటి నుంచి కాకినాడ జీజీహెచ్‌లోనే చికిత్స పొందుతోంది. కాగా ఆపరేషన్ తరువాత వెంకటలక్ష్మికి కుట్లు మానక, చీము పట్టి, గర్భ సంచి ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. తీవ్ర రక్తస్రావం అయ్యింది. బ్లడ్ ఎక్కించినా ఫలితం లేకపోవడంతో పరిస్థితి విషమించి జీజీహెచ్‌లోనే చికిత్స పొందుతూ ఆమె మరణించింది.

చికిత్స పొందుతూ నిర్మాణ కార్మికుడి మృతి

అనకాపల్లిటౌన్: భవన నిర్మాణ పనులు చేస్తున్న వ్యక్తి కాలుజారి పడిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు వివరాలివి. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు మండలం పోనంగి గ్రామానికి చెందిన ముక్కర నరసింహం(47), అదే గ్రామానికి చెందిన యాత్ర శ్రీనులు భవన నిర్మాణ పనులు నిమిత్తం శనివారం అనకాపల్లి పట్టణానికి వచ్చారు. పట్టణంలో బాలకృష్ణ బస్‌స్టాప్ వెనుక నూతనంగా నిర్మిస్తున్న అపార్టుమెంట్‌లో పై భవనంలో ఇద్దరూ పనులు చేస్తుండగా ఆదివారం మధ్యాహ్నం నరసింహం ప్రమాదవశాత్తూ కాలు జారి బిల్డింగ్‌పై నుంచి కింద పడిపోయాడు. పట్టణంలో ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అందించి విశాఖకు తరలించారు. విశాఖ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం నరసింహం మృతి చెందాడు. మృతుడు భార్య గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ప్రమాద బాధితులకు సకాలంలో సేవలు

మాడుగుల రూరల్: బైక్ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తులకు సకాలంలో సహకారం అందించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి ప్రాణాపాయం నుంచి కోలుకునేటట్టు చేశారు మాడుగుల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు పెరుమాళ్ల వెంకట్రావు. వివరాలివి. కింతలి గ్రామానికి చెందిన వెలుగులో పనిచేసే సీపీ రావాడ కొండబాబు, తుమ్మవానిపాలెం గ్రామానికి చెందిన ఎస్.చంటి ద్విచక్రవాహనంపై చోడవరం వెళ్లి వస్తుండగా విజయరామరాజుపేట సమీపంలో గాయిత్రీ డిగ్రీ కళాశాల వద్ద బైక్ గోతిలో పడి అదుపు తప్పి పడిపోయారు. వారిద్దరూ తీవ్రంగా గాయపడగా, అదే మార్గంలో కారులో మాడుగుల నుంచి చోడవరం వైపు వస్తున్న పెరుమాళ్ల వెంకట్రావు వారిని గమనించి వెంటనే సహాయం అందించారు. బాధితులకు సపర్యలు చేసి, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. 108 వాహనానికి సమాచారం అందించి అదే వాహనం మీద చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సకాలంలో సమాచారం ఇచ్చిన పెరుమాళ్ల వెంకట్రావు మానవత్వంను పలువురు ప్రశంసించారు. బాధితుల కుటుంబ సభ్యులు వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

రోడ్డు మరమ్మతులు ప్రారంభం


రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మోస్య

అనంతగిరి: టోకూరు పంచాయతీ చిట్టంపాడు గ్రామ సమీపంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన జలపాతం అభివృద్ధికి, అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాయవలస నుంచి చిట్టంపాడు రహదారి మరమ్మతు పనులకు సర్పంచ్ కిల్లో మోస్య శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో శ్రీహర్షిత్ చొరవతో జలపాతం అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పర్యాటకులకు అనుభూతినిచ్చేలా జలపాతం అందాలు ఉన్నాయని, పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు సహకారం అందిస్తున్న చిట్టంపాడు గ్రామస్తులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లంపీ స్కీన్ వ్యాధిపై అవగాహన అవసరం


అశ్వత్థామ, ఏడీ

దుంబ్రిగుడ: లంపీ స్కిన్ వ్యాధిపై రైతులంతా అప్రమతంగా ఉండేలా గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ అశ్వత్థామ అన్నారు. ఆయన మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని పశువులకు ముందుగా వ్యాక్సినేషన్లు ముమ్మరంగా చేయాలని సూచించారు. లంపీ స్కిన్ వ్యాధి సోకిన పశువులను మంద నుంచి దూరంగా ఉంచాలన్నారు. ఆయన మాట్లాడుతూ లంపీ వ్యాధి సోకిన పశువు శరీరంపై రెండు నుంచి ఐదు సెంటీమీటర్ల వ్యాసార్ధంతో బొబ్బర్లు ఉంటాయని, ఈ పరిస్థితుల్లో వెంటనే పశు సంవర్ధక సిబ్బందికి సమాచారం అందించి మెరుగైన వైద్యం పొందాలన్నారు. గిరిజన గ్రామాల్లో లంపీ స్కిన్ వ్యాధిపై విస్తృత ప్రచారం చేయాలని, సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వీరకిశోర్

మారేడుమిల్లి: సచివాలయం సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో వీర కిశోర్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీర కిషోర్ మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఆయా పంచాయితీ పరిధిలోని సచివాలయ సిబ్బంది పనితీరు గురించి ఆరా తీశారు. వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు. సచివాలయం ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఏఎన్ఎంలు వీధిగా ఆశ్రమ పాఠశాలలను తనిఖీలు చేసి, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

వేగవంతంగా హైవే మార్కింగ్ పనులు


కొలతలు తీస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: ఐ.పోలవరం నుంచి కొయ్యూరు వరకు దాదాపు 72 కిలోమీటర్ల నిడివిగల 516ఈ నేషనల్ హైవే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. రూ. 568.12 కోట్లతో ఈ రహదారి రూపుదిద్దుకొంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రస్తుతం సిబ్బంది రోడ్డు నిర్మాణానికి అవసరమైన కొలతలు, లెవెల్స్ తీస్తున్నారని ఎన్హెచ్ అసిస్టెంట్ ఇంజినీర్ చక్రవర్తి తెలిపారు. మలుపులు, రహదారి నిడివి తదితర విషయాలను సర్వేయర్లు పరిగణనలోకి తీసుకొని మార్కింగ్ ఇస్తున్నారన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

● గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం ● ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణకు ఘన స్వాగతం


గ్రామస్తులకు ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి


మక్కలపుట్టులో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి, పాడేరు: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన అన్ని వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆమలుచేస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. గుత్తులపుట్టు సచివాలయం పరిధిలోని పనసపల్లి, గోమంగి, నేరేడువలస గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 92 గడపలను ఆమె సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నవరత్న పథకాలు గిరిజనులకు వరం : ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నవరత్నాల పథకాలు గిరిజనులకు వరంగా మారాయన్నారు. పేద గిరిజనులకు ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనిస్తోందన్నారు. ప్రతి పక్షాలకు చెందిన కుటుంబాలకు కూడా అన్ని ప్రభుత్వ పథకాలు ఆమలవుతున్నాయన్నారు. ఏజెన్సీలో గిరిజనులంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఎంతో ఆదరిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి మరలా జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని గిరిజనులు సిద్ధంగా ఉన్నారన్నారు. సచివాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20లక్షల నిధులతో గ్రామాల్లో అత్యవసర పనులు చేపడతామన్నారు. అన్ని గ్రామాలకు రోడ్లు, రవాణా సౌకర్యాలు కల్పన, ఇంటింటికి సురక్షిత తాగునీరు పంపిణీ వంటి పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. సర్పంచ్‌లు జి.నీలకంఠం, డి.సన్యాసిరావు, ఎం.దొర,రాంబాబు, చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి, చిట్టమ్మ, మాజీ ఎంపీపీలు రమణమూర్తి, మంగ్లన్నదొర, నాయకులు రామసత్యవతి, సూరిబాబు, కన్నాపాత్రుడు, సత్యనారాయణ, కొండబాబు, కోటి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట:

హుకుంపేట: గిరిజన గ్రామల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మట్టుజోరు పంచాయతీలో సోమవారం కుంతుర్ల, డబ్బబంద, పెట్టుగోడల్ గ్రామాల్లో, మంగళవారం రంగపల్లి, నక్కపుట్టు, మట్టుజోరు గ్రామల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గుణకు గిరిజనులు థింసా నృత్యంతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లోని 410 గడపలను ఆయన సందర్శించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఏజెన్సీలో శివారు గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరుచేస్తోందన్నారు. డబ్బబందలో పాఠశాల భవనం, అంగన్‌వాడీ కేంద్రం భవనం, తాగునీటి సమస్య, నక్కపుట్టు గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటు, మంచి నీటి సమస్యలను విన్నవించారు. వారం రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తానని, మిగిలిన సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. నక్కపుట్టు, రంగపల్లి గ్రామల్లో పోడు భూముల సమస్య ఉందని పలువురు విన్నవించగా ఉన్నతాధికారులతో మాట్లాడి సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, సొసైటీ బ్యాంకు చైర్మెన్ రామకృష్ణ, సీడీపీవో బాలచంద్రమణి దేవి, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, పార్టీ గౌరవ అధ్యక్షుడు చినసత్యం, యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, సర్పంచ్ సాంభ, ఎంపీటీసీ సభ్యుడు భీమలింగేశ్వరరావు, సర్పంచ్ వెంకట పూర్ణిమ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

అనంతగిరి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మెగా రక్తదాన శిబిరం బుధవారం నిర్వహిస్తున్నారు. అరకులోయ సీఐ జి.దేముడుబాబు, మాతృభూమి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని సంస్థ ఇన్‌చార్జి జె.సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. దాతలు శిబిరానికి వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

28న కొయ్యూరులో..

కొయ్యూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొయ్యూరులో ఈనెల 28న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సీఐ స్వామినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

వై.రామవరం: వెదురునగరం గ్రామంలోని సాయిరాం ఆశ్రమ దేవాలయం ప్రాంగణంలో గాయత్రి హోమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి ఆధ్వర్యంలో కార్తీక మాసం ప్రారంభ పూజలు జరిపారు. కార్యక్రమంలో అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామానికి చెందిన రేణుకాలమ్మ మహంకాళీ అమ్మవారి దేవాలయ ప్రధాన అర్చకులు రాజారెడ్డి, తదితర వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


చెరకుంపాలెంలో వైద్య శిబిరానికి వచ్చిన గ్రామస్తులు


గొందోలులోని పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగప్రత్యూష

అడ్డతీగల: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్లవరం పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నాగప్రత్యూష అన్నారు. గొందోలులో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ శిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగ ప్రత్యూష మాట్లాడుతూ సుమారు 40 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశామన్నారు.104 మొబైల్ మెడికల్ యూనిట్ వైద్యులు పి.నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ స్వామిబాబు, సిబ్బంది దొరబాబు, లక్ష్మీ, సంతోష్‌రాజు తదితరులున్నారు.

రాజవొమ్మంగి: చెరకుంపాలెంలో ఫ్యామిలి డాక్టర్ మెడికల్ క్యాంప్ మంగళవారం జరిగింది. డాక్టర్ యామిని ప్రియ, 104 డాక్టర్ నాగార్జున రోగులను పరీక్షించి అవసరమైన చికిత్స అందజేశారు. శిబిరంలో 41 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్టు వారు చెప్పారు. సర్పంచ్ నాగేశ్వరరావు సేవలను పర్యవేక్షించారు. ఏఎన్ఎం శేషారత్నం, సూపర్‌వైజర్ రమణ, డీఈఓ శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మయ్య, శామ్యూల్ తదితరులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గింజర్తి టీమ్


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న డాక్టర్ మూర్తి


రన్నర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీ

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన రంపచోడవరం ఛాంపియన్స్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో గింజర్తి జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా సీతారం టీఎం నిలిచింది. పోటీల్లో ఏజెన్సీ 11 మండలాల నుంచి 52 టీమ్‌లు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజేత జట్టుకు రూ. 20 వేలు నగదు, ట్రోఫీని రంపచోడవరం ఏరియా ఆస్పత్రి డాక్టర్ మూర్తి అందజేశారు. రన్నరప్ సీతారం జట్టుకు రూ. 10 వేలు నగదు, ట్రోఫీని ఎంపీటీసీ సభ్యురాలు ఉలవల లక్ష్మి అందజేశారు. గింజర్తి టీమ్‌కు చెందిన విజయ్‌కు మ్యాన్ ఆఫ్ ద సిరిస్‌ను డాక్టర్ ముఖర్జీ అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్ ట్రోఫీను డాక్టర్ మధు అందజేశారు. టోర్నమెంట్‌కు నగదు బహుమతిని నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుసిరెడ్డి శివప్రసాద్ అందించినట్టు టోర్నీ నిర్వాహకుడు రైల్వే బోర్డు మెంబర్ డి.రామారావు తెలిపారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించిన సుధాకర్, రవిచంద్రలకు పలువురు అభినందించారు.

నేడు రాయపల్లిలో గడప గడపకు

అడ్డతీగల: రాయపల్లిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.రత్నరాజు తెలిపారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

రేపు గడుఓకుర్తిలో..

రాజవొమ్మంగి: గడుఓకుర్తి పంచాయతీ బోనంగిపాలెం, గొబ్బిలమడుగు, చీడిపాలెం, బూసులపాలెం, బూడిదవారి మఖాలు, కింద్ర పంచాయతీ అనంతగిరిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

విస్తృతంగా వాహన తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వై.రామవరం: మండల కేంద్రంలో ఎస్ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. లోతట్టు, సరిహద్దు ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. వాహన రికార్డులు, లైసెన్స్‌లు సక్రమంగా లేని వారిపై కేసులు నమోదు చేశారు. అడిషనల్ ఎస్ఐ రాంబాబు, సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసు సిబ్బంది, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ


కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రాజుబాబు, సీడీపీవో బాలచంద్రమణి

హుకుంపేట: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో బాలచంద్రమణి దేవి ఆధ్వర్యంలో సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ఎంపీపీ కూడా రాజుబాబు మంగళవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పోష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలను స్థానిక ఎంపీటీసీలు, సర్పంచ్‌ల దృష్టికి తీసుకురావాలన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది ఆరోగ్య భద్రతపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సర్పంచ్ వెంకట పూర్ణిమ, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే విజయం సొంతం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ దేముడుబాబు

అరకులోయ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, సన్మార్గంలో నడవాలని అరకులోయ సీఐ జి.దేముడుబాబు అన్నారు. యండపల్లివలసలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గురుకులం బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులతో ఉన్నత విద్య, కేరీర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ దేముడుబాబు మాట్లాడుతూ పోలీసు శాఖ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రమశిక్షణ, లక్ష్యంతో చదివితే విజయం సొంతమవుతుందన్నారు. మూఢ నమ్మకాలు విడనాడాలన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు


గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటరావు

దుంబ్రిగుడ: పోతంగి పంచాయతీ నందివలస గ్రామంలో భూముల రీసర్వేపై సర్పంచ్ వెంకటరావు అధ్యక్షతన బుధవారం గ్రామసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. భూముల రీసర్వేలో ఎటువంటి సమస్యలు లేకపోవడం అభినందనీయమన్నారు. ఈ మేరకు గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించడం మంచి పరిణామమన్నారు. గ్రామాల్లో భూ సమస్యలు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న రీసర్వే చరిత్రాత్మకమన్నారు. రైతులందరూ భూముల రీ సర్వే చేయించుకొవాలని, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సూపర్‌వైజర్ మాణిక్యం, ఝాన్సీ, బాలయ్య, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పంచాయతీలకు రూ.80 లక్షల నిధులు

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం, చికిలింత, దూసరపాము, గడుఓకుర్తి పంచాయతీల్లో ఒక్కో పంచాయతీకు రూ. 20 లక్షల చొప్పున రూ.80 లక్షల నిధులు మంజూరైనట్టు పంచాయతీ రాజ్ జేఈ రవితేజ మంగళవారం తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా ప్రజాప్రతినిధుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి పంచాయతీకు రూ. 20లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు మండలంలో గడపగడపకు కార్యక్రమాలు జరిగిన నాలుగు పంచాయతీలకు ఈ నిధులు మంజూరైనట్టు చెప్పారు. మిగిలిన పంచాయతీలకు కూడా నిధులు విడుదలవుతాయన్నారు. ఇప్పటివరకు విడుదలైన నిధులతో ప్రజాప్రతినిధుల సలహా, సూచనల మేరకు శరభవరం పంచాయతీలో రెండు డ్రెయినేజీలు, నాలుగు సీసీ రోడ్లు, చికిలింత పంచాయతీలో మూడు సీసీ రోడ్లు, దూసరపాములో ఆరు సీసీ రోడ్లు, గడుఓకుర్తి పంచాయతీలో మూడు సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఆయా పనులు పంచాయతీ రాజ్ , ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు.

అంబరాన్నంటిన దీపావళి పండగ


దీపాలు వెలిగిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు


చట్రాయిపుట్టులో రావణాసురుడి దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు విల్లు ఎక్కుపెట్టిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



రాజవొమ్మంగిలో దీపాలంకరణలో కుటుంబ సభ్యులు



గ్రామాల్లో చిన్నారుల సందడి

సాక్షి, పాడేరు/హుకుంపేట/ముంచంగిపుట్టు/అనంతగిరి/జి.మాడుగుల/చింతపల్లిరూరల్: చీకటిని పారద్రోలి వెలుగులు తెచ్చే పండుగ..విజయానికి ప్రతీకగా నిలిచే దివ్వెల పండగ దీపావళి వేడుకను జిల్లా వ్యాప్తంగా ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇంట్లో లక్ష్మీ దేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. రక రకాల పిండివంటలు వండి నివేదించారు. ప్రమిదలతో పాటు చూడచక్కని విద్యుత్ తోరణలతో ఇళ్లను అందంగా అలంకరించారు.ఆముదం, చెరకు గెడలతో జ్యోతులు వెలిగిస్తూ సంప్రదాయ ప్రకారం పండుగ నిర్వహించారు. అనంతరం తారజువ్వాలు, చించుబుడ్లిలు వెలిగిస్తూ టపాసులు పేలుస్తూ పండుగను జరుపుకున్నారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రతో పాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లంతా తమ నివాస గృహాలలో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళిని ఘనంగా జరుపుకున్నారు. అధికారుల ఇళ్లల్లో కూడా దీపావళి సందడి నెలకొంది. హుకుంపేటలో జరిగిన వేడుకలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొని రావణాసూరుడు బొమ్మను విల్లుతో కాల్చారు. బాణాసంచా వెలుగులలో చిన్నారులు, మహిళలు, యువకులు కేరింతలు కొడుతూ రాత్రి 10గంటల వరకు ప్రజలు సంతోషంగా పండగను జరుపుకున్నారు. ఎక్కడ ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకపోవడంతో పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులంతా సంతోషం వ్యక్తం చేశారు.

క్రీడాకారులకు అభినందనలు


అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలు

అరకులోయ రూరల్: విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. జూనియర్ విభాగ పోటీల్లో ధనలక్ష్మి రన్నింగ్‌లో(మూడో స్థానం),సోమేశ్వరరావు రరిన్నింగ్‌లో(రెండో స్థానం), అప్పలరాజు షాట్‌పుట్‌లో (మూడవ స్థానం), జావెలిన్‌త్రోలో (రెండో స్థానం) ప్రతిభకనబరిచారు. ఆయా క్రీడాకారులను మంగళవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, మంచిపేరు తీసుకొచ్చి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పీడీ అప్పారావు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు ఎక్స్‌లెన్సీ అవార్డు


అవార్డు అందుకొంటున్న శ్రీనివాసరావు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో బేసిక్ ప్రాక్టీషనర్‌గా (ఆర్ఎంపీ డాక్టర్‌గా) వైద్య సేవలు అందిస్తున్న ఎస్.శ్రీనివాసరావుకు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డు అందజేశారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హెల్త్‌కేర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన వారికి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డుల ప్రదానం జరిగింది. ఇందులో భాగంగా డాక్టర్ జయప్రకాష్ నారాయణ, ఐఏఎస్. తదితర ప్రముఖల చేతులమీదుగా శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత శ్రీనివాసరావును స్థానికులు అభినందించారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

కూనవరం: నాయీబ్రాహ్మణుల ఆరాధ్య దైవం ధన్వంతరి వైద్య నారాయణుని జయంతిని మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనవరం, వీఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాల నాయీ బ్రాహ్మణ పెద్దలు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులంతా తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. సూర్యనారాయణ, వెంకటరావు, రాజు, శివశంకర్, కొండబాబు, రమణ, శ్రీను, నాగేశ్వరరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.